క్లుప్తంగా

వేంపల్లిలో డీఆర్డీవో పర్యటన



నర్సరీని పరిశీలిస్తున్న డీఆర్డీవో కిషన్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం వేంపల్లిలో మంగళవారం జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి(డీఆర్డీవో) కిషన్ ఆకస్మికంగా పర్యటించారు. నర్సరీని సందర్శించి మొక్కల సంరక్షణ, నిర్వహణపై వనసేవక్, క్షేత్ర సహాయకులకు పలు సూచనలు చేశారు. డీఆర్డీవో వెంట ఎంపీవో ఉమర్ షరీఫ్, ఈజీఎస్ ఏపీవో మల్లయ్య, కార్యదర్శి ప్రతిభ, సాంకేతిక సహాయకుడు శంకర్, క్షేత్ర సహాయకురాలు స్వర్ణ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఎడ్యుకేషన్ ఎక్స్‌లెన్స్ అవార్డు



అవార్డు అందుకుంటున్న ఉపాధ్యాయులు

జన్నారం: జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల కిష్టాపూర్‌లో ప్రత్యేక బోధన అందించి జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించినందుకు గాను జన్నారం మండలం కిష్టాపూర్ ఉన్నత పాఠశాలకు చెందిన ప్రధానోపాధ్యాయుడు గుండ రాజన్న, ఉపాధ్యాయులు దాముక కమలాకర్, జాడి మురళి మంగళవారం ఎడ్యుకేషనల్ ఎక్సలెంట్ అవార్డులను అందుకున్నారు. జిల్లా విద్యాధికారి యాదయ్య, సెక్టోరియల్ అధికారులు చౌదరి, సత్యనారాయణ మూర్తి, శ్రీనివాస్, యశోదర, మండల విద్యాధికారి విజయకుమార్, పాఠశాల చైర్మన్ మంగలు వారికి అభినందనలు తెలిపారు.

ఆవడంను మండలంగా ఏర్పాటు చేయాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నెన్నెల: మండలంలోని ఆవడం పంచాయతీని నూతన మండలంగా ఏర్పాటు చేయాలని పది గ్రామాల నాయకులు బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌కు మంగళవారం హైదరాబాద్‌లో వినతిపత్రం అందజేశారు. ఆవడం, గంగారాం, జెండావెంకటాపూర్, చిత్తాపూర్, మెట్‌పల్లి, నార్వాయిపేట, కొత్తూర్, గుండ్లసోమారం, చిన్నవెంకటాపూర్ గ్రామపంచాయతీలతో కొత్త మండలంగా ఏర్పాటు చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే వినోద్ జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. పది గ్రామాల జనాభా, అక్కడి స్థితిగతులపై నివేదిక సిద్ధం చేయాలని సూచించారు. మాజీ ఎంపీపీ తారాచంద్, కాంగ్రెస్ నాయకులు దుర్గం రవీందర్, ఉయ్యాల మల్లీక, మహ్మద్ జలీల్, జాడి రాజ్‌కుమార్, దేవేందర్, రాజిరెడ్డి, బీష్మా, తిరుపతి ఉన్నారు.

'ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలు విరమించుకోవాలి'

పాతమంచిర్యాల: మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు ఈ నెల 06న జిల్లా కేంద్రంలో జరిగిన ఓ కార్యక్రమంలో జర్నలిస్టులను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని, టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షులు డేగ సత్యం, ప్రధాన కార్యదర్శి పింగళి సంతోష్‌రెడ్డి, కోశాధికారి వంశీకృష్ణ, ఉపాధ్యక్షులు మద్దెల సంజీవ్, రవిరాజ్‌లు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తాను తలుచుకుంటే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సగం పత్రికలు, టీవీ చానళ్లను మూసివేయిస్తానని హెచ్చరించే ధోరణిలో వ్యాఖ్యానించడాన్ని తమ సంఘం తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఎమ్మెల్యే తాను చేసిన వ్యాఖ్యలు తక్షణమే వాపస్ తీసుకుంటున్నట్లు ప్రకటించాలని యూనియన్ డిమాండ్ చేస్తుందన్నారు. లేనిపక్షంలో రాష్ట్ర నాయకత్వం ఆదేశాల మేరకు తదుపరి కార్యాచరణలో భాగంగా నిరసన కార్యక్రమాలు చేపడుతామన్నారు.

టీ షర్ట్స్ అందజేత



టీషర్ట్స్ అందిస్తున్న శ్రీధర్, రవి

మంచిర్యాలటౌన్: మంచిర్యాలలో గత ఏడాది నుంచి నిర్వహిస్తున్న మంచిర్యాల ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు అంజనీపుత్ర చైర్మన్ గుర్రాల శ్రీధర్, ఎండీ పిల్లి రవిలు అంజనీపుత్ర టీషర్ట్స్‌ను మంగళవారం అందించారు. ఎంపీఎల్ సీజన్ 2 ఈ నెల 8వ తేదీ నుంచి జిల్లా కేంద్రంలోని శివాజీ గ్రౌండ్‌లో ప్రారంభం అవుతుందని, 16వ తేదీ వరకు పోటీలు ఉంటాయన్నారు.

దారితప్పుతున్న ధాన్యం



గూడెం వద్ద పట్టుబడిన ధాన్యం లారీ(ఫైల్)

- చక్రం తిప్పుతున్న ప్రైవేటు వ్యాపారులు, దళారులు
- అధికారుల సంతకాలు ఫోర్జరీ
- తప్పుడు పత్రాలతో కాజేసే యత్నం?

దండేపల్లి: రైతులు పండించిన వరిధాన్యాన్ని లారీలు, వ్యాన్లద్వారా మిల్లులకు తరలించే సమయంలో ధ్రువపత్రాలు తప్పనిసరి. కానీ ధ్రువపత్రాల్లో పలువురు ప్రైవేటు వ్యాపారులు, మధ్య దళారులు అనేక అక్రమాలకు పాల్పడుతున్నారనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. దండేపల్లి మండలం మామిడిపల్లిలో ఫాం నంబర్ 10లో గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారి సంతకాన్ని ఫోర్జరీ చేసిన విషయం తెలిసిందే. అక్రమాలకు ఇది ఒక బలమైన ఉదాహరణగా నిలిచింది. ప్రైవేటు వ్యాపారులు ధాన్యం తరలిస్తే, ఏ గ్రామం నుంచి ధాన్యం తీసుకెళ్తే, ఆ గ్రామ సర్పంచ్ లేదా ప్రత్యేకాధికారి, వీఆర్వో ద్వారా ఫాం నంబర్ 10లో, ధాన్యం అమ్మిన రైతుల వివరాలు నమోదు చేసి ధ్రువీకరించి ఇస్తారు. ధాన్యం లారీలను వ్యవసాయ మార్కెట్ అధికారులు తనిఖీలు చేసి పంపిస్తుంటారు. తనిఖీ సమయంలో ప్రైవేటు వ్యాపారులు, ట్రేడ్‌లైసెన్స్‌దారులు పంపించే ధాన్యం వాహనాలకు ఫాం నంబర్ 10 పరిశీలించి రశీదు ఇస్తారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల నుంచి తరలిస్తే ట్రక్‌షీట్‌ను చూసి పంపిస్తారు. ప్రస్తుతం గ్రామాల్లో ప్రత్యేకాధికారులపాలన సాగడంతో ప్రైవేటు వ్యాపారులు తీసుకెళ్తున్న ధాన్యానికి ఫాం నంబర్ 10లో ప్రత్యేకాధికారి ధృవీకరించి ఇవ్వాలి, అయితే అన్ని చోట్ల ప్రత్యేకాధికారులు ధృవీకరిస్తున్నారా? లేక వ్యాపారులు, దళారులే అధికారుల సంతకాలను ఫోర్జరీ చేస్తున్నారో కూడా తెలియడం లేదు. సంతకాలు ఫోర్జరీతో పాటు, రైతుల నుంచి ప్రైవేటు వ్యాపారులు, మధ్య దళారులు ధాన్యాన్ని ప్రభుత్వ మద్దతు ధర కంటే తక్కువకే విక్రయించి, రైతుల బోనస్‌ను వ్యాపారులు, మధ్య దళారులు నొక్కేసే ఆసక్తికర ప్రయత్నాలు కూడా వెలుగు చూడటం, మరిన్ని అనుమానాలకు తావిస్తోంది. అధికారులు దృష్టిసారించి అక్రమాలు జరగకుండా, రైతులకు మేలు జరిగేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

లారీలను తనిఖీ చేస్తున్నాం..

వరిధాన్యం లారీలను తనిఖీ చేసి ధ్రువపత్రాలు పరిశీలిస్తున్నాం. ట్రేడ్‌లైసెన్స్ దారుల కు మార్కెట్ ఫీజు తీసుకొని రశీదులు ఇస్తున్నాం. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలవి అయితే ట్రక్‌షీట్ చూసి పంపిస్తున్నాం.

– శ్రీనివాస్, లక్సెట్టిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ సెక్రటరీ

రైతుల పరేషాన్..!

- ఫోర్జరీ సంతకం కేసులో పట్టుబడిన ధాన్యం లారీ
- నాలుగురోజులుగా పోలీస్‌స్టేషన్లోనే..

దండేపల్లి: డబ్బులు అత్యవసరం కావడంతో దండేపల్లి మండలం మామిడిపల్లికి చెందిన కొంతమంది రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ మద్దతు ధరకంటే తక్కువ ధరకే దళారులకు అమ్ముకున్నారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని దళారి మిల్లుకు తరలించే క్రమంలో ధ్రువపత్రంలో అధికారి సంతకాన్ని ఫోర్జరీ చేసి అడ్డంగా దొరికిపోయాడు. దీంతో ధాన్యం లారీ మిల్లుకు చేరకుండా పోలీస్‌స్టేషన్లో ఉండిపోయింది. తమ అవసరానికి దళారికి ధాన్యంఅమ్మడంతో వారికి సమయానికి డబ్బులు అందకుండా పోయాయి. పట్టుబడిన లారీ ఎప్పుడు విడుదల చేస్తారు. తమ ధాన్యం మిల్లుకు ఎప్పుడు చేరుతుంది. తమకు డబ్బులు ఎప్పుడు అందుతాయో అని రైతులు ఎదురు చూస్తున్నారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు చొరవ చూపి పట్టుబడిన ధాన్యం లారీ కేసును త్వరగా పరిష్కరించి తమకు త్వరగా డబ్బులు అందేలా చూడాలని బాధిత రైతులు కోరుతున్నారు.

పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- డీఎల్‌పీవో ధర్మారాణి



పనులు పరిశీలిస్తున్న డీఎల్‌పీవో ధర్మారాణి

భీమారం: పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని డీఎల్‌పీవో ధర్మారాణి హెచ్చరించారు. భీమారం మండల కేంద్రంలో గ్రామపంచాయతీ ద్వారా చేపట్టిన పనులను మంగళవారం ఆమె తనిఖీ చేశారు. మురుగు కాలువల్లో చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని, రోడ్లపై చెత్త వేసే వారిని గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. నర్సరీని పరిశీలించారు. మొక్కలకు నీటిని సంవృద్ధిగా అందించాలన్నారు. గ్రామపంచాయతీ రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శి కృష్ణమూర్తి ఉన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

- కలెక్టరేట్ ఎదుట ధర్నా, ఏవోకు వినతి



ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

పాతమంచిర్యాల: అంగన్‌వాడీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్, హెల్పర్ యూనియన్ జిల్లా కార్యదర్శి తోకల సరస్వతి, సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేకలదాసు డిమాండ్ చేశారు. కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించి, కలెక్టర్ కార్యాలయ ఏవో రాజేశ్వర్, జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారి రవూఫ్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ ఉద్యోగులు శంకరమ్మ, కుసుమ కుమారీ, అరుణ, శారద, పద్మావతి, రేణుక, రాజమణి, విజయలక్ష్మీ, సమ్మక్క, పద్మ, సీపీఐ పట్టణ కార్యదర్శి ఖలీందర్ అలీఖాన్ పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలు అమలు చేయాలి

- ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



మాడవెల్లిలో కార్యకర్తలతో ప్రవీణ్ కుమార్

భీమిని: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారంటీలను నెరవేర్చాలని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. కన్నెపల్లి మండలంలోని మాడవెల్లి గ్రామంలోని బీఆర్ఎస్ కార్యకర్తలను కలిసి మంగళవారం సమస్యలపై చర్చించారు. సాలిగాం నుంచి నాయకునిపేట గ్రామం వరకు బీటీ రోడ్డుతో పాటు నల్లవాగుపై వంతెన ఏర్పాటు చేసి ప్రజలకు రవాణా సౌకర్యం కల్పించాలన్నారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో గాండ్ల నారాయణ, వెంకటేశ్, కమలాకర్, పోషం, రవి, మధుకర్ ఉన్నారు.

మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు



మాట్లాడుతున్న ఎంవీఐ కిశోర చంద్రారెడ్డి

లక్సెట్టిపేట: మైనర్ విద్యార్థులు వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కిశోర చంద్రారెడ్డి అన్నారు. రోడ్డు భద్రత ఉత్సవాల సందర్భంగా మండల కేంద్రంలోని ట్రినిటీ పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. విద్యార్థులు మేజర్ అయితేనే వాహనాలు నడపాలన్నారు. ప్రతి ఒక్కరూ నియమ నిబంధనలు పాటించాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు వాహనాల నియమాలపై వ్యాస రచన పోటీలు నిర్వహించి, ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సిబ్బంది కాసిహషాహెబ్, సూర్యతేజ, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్సై

కాసిపేట: యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని దేవాపూర్ ఎస్సై ఆంజనేయులు అన్నారు. మండలంలోని సోనాపూర్ గ్రామపంచాయతీ సాలెగూడ, గట్రావుపల్లి మైదానంలో నిర్వహిస్తున్న ఆదివాసీ మెగా క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై కుమురం భీం చిత్రపటానికి పూలమాల వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలు శారీరక, మానసికోల్లాసానికి ఎంతో దోహదపడుతాయని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పెందూర్ చందు, మడావి భారిక్‌రావు, మాజీ సర్పంచులు పెంద్రం రాజు, పెంద్రం సింగ్, తుడుందెబ్బ మండలాధ్యక్షుడు సంద్ర భూమన్న, గట్రావుపల్లి పంచాయతీ కార్యదర్శి తనూజా, సిడాం గణపతి, పెందూర్ ప్రభాకర్, శ్రీనివాస్, కృష్ణమోహన్, భీం రావు, తదితరులున్నారు.

క్రైం కార్నర్..

క్షుద్ర పూజల కలకలం

బెల్లంపల్లి: బెల్లంపల్లి కన్నాల బస్తీలోని ఓ ఇంటి ముందు క్షుద్రపూజలు చేసిన ఘటన కలకలం రేపింది. సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఆ చర్యకు పాల్పడ్డా రు. బస్తీలో నివాసం ఉంటున్న మారుపాక శ్రీనివాస్ ఇంటి ఎదుట ఈ ఘటన చోటు చేసుకుంది. మంగళవారం పొద్దున్నే ఈ క్షుద్రపూజలను చూసి భయంతో ఆయన కుటుంబం ఇంటికి తాళం వేసి వెళ్లిపోయింది. ఈ ఘటన బస్తీలో చర్చనీయాంశమైంది. శ్రీనివాస్‌ను ఇబ్బందులకు గురి చేయాలనే ఉద్దేశంతో ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు క్షుద్ర పూజలు చేసి ఉంటారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

సీఎం రేవంత్‌రెడ్డికి ఫిర్యాదు

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో గత నెల 29వ తేదీ రాత్రి తనపై జరిగిన దాడి ఘటన గురించి ఆరిజిన్ డెయిరీ సీఈవో కందిమళ్ల ఆదినారాయణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. మంగళవారం తన ఫిర్యాదును సీఎంకు మెయిల్ చేశారు. దాడి జరిగాక పోలీసులు వచ్చి తనను ప్రభుత్వాసుపత్రికి పంపించారని, ఆ దాడి ఘటనకు సంబంధించి ఫిర్యాదులో తాను పేర్కొన్న అంశాలను పరిగణలోకి తీసుకోకుండా నిందితులపై హత్యాయత్నం కేసు నమోదు చేయకుండా సెక్షన్లతో ఎఫ్ఆర్ఐ నమోదు చేశారని పేర్కొన్నారు.

బ్యాంకు సిబ్బందిని బురిడీ కొట్టించిన వ్యక్తికి జైలు

మంచిర్యాలక్రైం: స్థానిక ఐబీ చౌరస్తాలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సిబ్బందిని బురిడి కొట్టించి రూ.50వేలు నగదు దోచుకెళ్లిన వ్యక్తికి ఆరు నెలల సాధారణ జైలుశిక్ష విధిస్తూ మంగళవారం స్థానిక జుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్, జూనియర్ సివిల్ జడ్జి కే.నిరోష తీర్పునిచ్చినట్లు స్థానిక సీఐ ప్రమోద్‌రావు తెలిపారు. సీఐ వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో క్యాష్ కౌంటింగ్, ప్రింటర్ రిపేరు చేసేందుకు ఐటీ డిపార్ట్‌మెంట్ నుంచి వచ్చినట్లు రోహిత్ అనే వ్యక్తి బ్యాంక్ సిబ్బందితో 2024 ఆగస్టు 12న పరిచయం చేసుకుని నమ్మించాడు. క్యాష్ కౌంటింగ్ మిషన్ రిపేరు చేసే క్రమంలో సిబ్బంది వద్ద రూ.50వేల బెండల్ ఒకటి తీసుకొని కౌంటింగ్ చేస్తున్నట్లు నటించాడు. కొంత సమయం గడిచాక సిబ్బంది కళ్లు గప్పి రూ.50వేల నగదుతో ఉడాయించాడు. తర్వాత ఎక్కడా ఎలాంటి ఆధారం లభించకపోవడంతో జరిగిన విషయాన్ని బ్యాంకు మేనేజర్ చిద్రాల సందీప్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదుతో అప్పటి ఎస్సై సనత్‌కుమార్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని, సీసీ కెమెరాల ఆధారంగా నిందితున్ని గుర్తించి, హైదరాబాద్‌కు చెందిన రోహిత్ బాబ్లాల్‌ఖాలేను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సాంకేతిక ఆధారాలను కోర్టులో ప్రవేశపెట్టగా అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎస్.రవీందర్ న్యాయమూర్తికి వాదనలు వినిపించగా నేరం రుజువైనందునా రోహిత్‌కు ఆరు నెలల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

జన్నారం: జన్నారం అటవీ డివిజన్ ఇందన్‌పల్లి అటవీ రేంజ్ పరిధిలోని మల్లాపూర్ వాగులో నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను మంగళవారం అటవీ అధికారులు సీజ్ చేశారు. విచారిస్తే ట్రాక్టర్ అజ్మీరా తిరుపతిగా తేలిందని రేంజ్ అధికారి కారం శ్రీనివాస్ తెలిపారు. అటవీ ప్రాంతంలోకి అనుమతి లేకుండా వెళ్లినా, ఇసుక తోడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సెక్షన్ అధికారి మోతే రవి, బీట్ అధికారి ముజీబోద్దీన్ ఉన్నారు.

రెండు తలల పాము స్వాధీనం

చెన్నూర్‌రూరల్: మహారాష్ట్ర నుంచి రెండు తలల పామును తీసుకొస్తుండగా సోమవారం రాత్రి మండలంలోని చింతలపల్లి గ్రామ సమీపంలో దాడి చేసి పట్టుకుని అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పామును తీసుకొస్తున్న కోటపల్లి మండలానికి చెందిన వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నట్లు సమాచారం.

సంక్షిప్త వార్తలు

మందమర్రిలో కార్డన్ సెర్చ్

మందమర్రిరూరల్: పట్టణంలోని అంగడిబజార్ కాలనీలో మంగళవారం సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్సై రాజశేఖర్ ఆధ్వర్యంలో కార్డన్‌సెర్చ్ చేపట్టారు. డాగ్‌స్కాడ్‌తో తనిఖీలు చేశారు. 34ద్విచక్రవాహనాలు సీజ్ చేశారు. 10లీటర్ల గుడుంబా పట్టుకున్నారు.

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బైక్‌ర్యాలీ

జైపూర్: ప్రతీ రైతుకు రూ.15వేల చొప్పున రైతుభరోసా ఇవ్వాలని బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ నాయకులు డాక్టర్ రాజా రమేశ్ డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో జైపూర్ మండలం ఇందారం నుంచి టేకుమట్ల, షెట్‌పల్లి మీదుగా కిష్టాపూర్, పౌనూర్ వరకు బైక్‌ర్యాలీ నిర్వహించారు.

పనుల పరిశీలన

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండల పరిధిలోని టీకానపల్లి గ్రామ శివారులోని కడెం 42 డిస్ట్రిబ్యూటరీ కాలువకు అనుసంధానంగా ఉన్న ఎస్–7 కాలువ తూము ఆయకట్టు చివరి వరకు చేపట్టనున్న కాలువ లైనింగ్ పనులను మంగళవారం ఇరిగేషన్ శాఖా అధికారులు పరిశీలించారు.

క్రీడాకారునికి సన్మానం

నస్పూర్: పట్టణ పరిధిలోని సీసీసీకి చెందిన బాసాని ఆదర్శ్ 15సంవత్సరాలుగా బాక్సింగ్ పోటీల్లో జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొని బహుమతులు సాధించాడు. ఈ క్రమంలో ఆయన స్పోర్ట్స్ కోటాలో టీజీఎస్పీలో ఉద్యోగం సాధించారు. ఈ సందర్భంగా ఆయనను మంగళవారం నస్పూర్–శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ సభ్యులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

టీఎన్జీవోస్ గృహనిర్మాణ సంఘ ఎన్నికలు

మంచిర్యాలటౌన్: తెలంగాణ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల పరస్పర సహాయక సహకార గృహ నిర్మాణ సంఘం జిల్లా ఎన్నికల షెడ్యూల్‌లో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను ఎన్నికల అధికారి ఎం. శ్యాంసుందర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. 9 పోస్టులకు గాను 12మంది అభ్యర్థులు వారి నామినేషన్లు వేసినట్లు తెలిపారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

మంచిర్యాలఅర్బన్: జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీయుటీఎఫ్) క్యాలెండర్‌ను మంగళవారం డీఈవో యాదయ్య ఆవిష్కరించారు.

దేశ వ్యాప్తంగా బీసీ గణన చేపట్టాలి

చెన్నూర్: దేశ వ్యాప్తంగా బీసీ గణన చేపట్టాలని బీసీ రాజ్యాధికార సమితి జిల్లా కన్వీనర్ వడ్డెపల్లి మనోహర్ అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. బీసీల భవిష్యత్ ప్రణాళిక సిద్ధం చేసేందుకు ఈ నెల 12న మంచిర్యాలలోని శ్రీహర్ష డిగ్రీ కళాశాలలో బీసీ రాజ్యాధికార సమితి ఆధ్వర్యంలో జిల్లా సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఒకేషనల్ గ్రూపు జీఎఫ్‌సీ అధ్యాపకులు దర్శనాల తిరుపతి జాతీయ స్థాయి రన్నింగ్ క్రీడా పోటీలకు ఎంపికై నట్లు కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌రావు తెలిపారు.

రామాలయంలో పూజలు

భీమారం: ధనుర్మాసం సందర్భంగా మండల కేంద్రంలోని శ్రీకోదండరామాలయంలో మంగళవారం మహిళలు మంగళహారతులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ప్రవీణాచార్యులు తీర్థప్రసాదాలు అందజేశారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

నెన్నెల: రోడ్డు భద్రత నియమాలను ప్రతి ఒక్కరూ పాటించాలని బెల్లంపల్లిరూరల్ సీఐ అఫ్జలొద్దిన్ అన్నారు. చిత్తాపూర్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌లో వివిధ మండలాల నుంచి పాల్గొన్న యువకులకు జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా రోడ్డు భద్రత, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.

పాతమంచిర్యాల: రహదారుల నిర్వహణ సరిగ్గా లేక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని సోషలిస్టు రిపబ్లికన్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ మోతే రాజలింగు అన్నారు. జిల్లా కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రోడ్డు భద్రత నియమాలు పాటించాలని సూచించారు.

బొగ్గుబాయి వార్తలు

జీఎం ఆఫీస్ ఫిట్ కమిటీ ఎన్నిక

శ్రీరాంపూర్: గుర్తింపు సంఘం ఏఐటీయూసీ శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం ఫిట్ కమిటీని ఎన్నుకున్నారు. ఆ యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి షేక్ బాజీసైదా హాజరయ్యారు. ఫిట్ కార్యదర్శిగా బొడ్డు సందీప్‌కుమార్, సహాయ కార్యదర్శి మెరుగు సంధ్య, చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీగా చింతకింది సురేష్, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా ఆడ మధు, ఎస్ రామకృష్ణ, అమరగొండ మహేష్, గుత్తిన సాయి రాజేష్, అర్కర గోపాల్, పూజితలను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

శ్రీరాంపూర్: సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను హైదరాబాద్‌లోని మేడ్చల్ మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ చైర్మన్ కొండల్ రెడ్డి చేతుల మీదుగా మంగళవారం ఆవిష్కరించారు.

సమస్యలు పరిష్కరించాలి

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ సీహెచ్‌పీలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు యాజమాన్యంను డిమాండ్ చేశారు. ఆ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం సీహెచ్‌పీ డీజీఎంను కలిసి వినతిపత్రం సమర్పించారు.

వైద్యం, ఆరోగ్యంపై అవగాహన

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని మార్కెట్ ఏరియాలో జాతీయ ఆరోగ్య మిషన్ ఆధ్వర్యంలో వైద్యం, ఆరోగ్యంపై మంగళవారం అవగాహ న కల్పించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి హరీష్‌రాజ్ హాజరై ప్రారంభించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు గిరిజన ప్రాంతాల్లో నెలకొల్పిన ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాల ద్వారా 100శాతం గర్భవతుల నమో దు, వ్యాధి నిరోధక టీకాలు, వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మందమర్రి మెడికల్ ఆఫీసర్ రమేష్, సిబ్బంది వెంకటేశ్వర్, వెంకట్‌సాయి ఉన్నారు.

సమాచారం

దరఖాస్తుల ఆహ్వానం

మందమర్రిరూరల్: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్లో 6వ తరగతిలో 100సీట్లు, 7–10తరగతుల్లో మిగులు సీట్ల కోసం ఆన్‌లైన్లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్కూల్ ప్రిన్సిపాల్ శారా తస్నీమ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 28వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పత్తి కొనుగోళ్ల నిలిపివేత

చెన్నూర్: చెన్నూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని ఐదు జిన్నింగ్ మిల్లులలో పత్తి నిల్వలు పెరిగిపోవడంతో బుధవారం నుంచి కొనుగోళ్లు తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి రామాంజనేయులు, సీపీవో డి.కె.నాయక్‌లు తెలిపారు. పత్తి కొనుగోళ్ల ప్రారంభం తేదీని ప్రకటించేంత వరకు పత్తి వాహనాలు తీసుకొని రావద్దని పేర్కొన్నారు. రైతులు ఈ విషయాన్ని గమనించి అధికారులకు సహకరించాలని కోరారు.

జంగల్ సఫారీలోకి 14జింకలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): లక్సెట్టిపేట అటవీ రేంజ్ పరిధి, పాతమంచిర్యాల అటవీ సెక్షన్ పరిధిలోగల తిమ్మాపూర్ అటవీ బీట్‌లో ఇటీవల ఏర్పాటు చేసిన జంగల్ సఫారీలోకి మంగళవారం కరీంనగర్ జిల్లా జింకల పార్కు నుంచి తీసుకొచ్చిన 14జింకలను వదిలిపెట్టారు. కార్యక్రమంలో మంచిర్యాల డివిజన్ అటవీ అధికారి సర్వేశ్వర్, అటవీ రేంజ్ అధికారి సుభాశ్, ఎఫ్ఎస్‌వో అతావుల్లా, అల్తాఫ్, ఎఫ్‌బీవోలు రాజేందర్, సంతోశ్ పాల్గొన్నారు.

రేపు వాహనాల వేలం

మంచిర్యాలక్రైం: ఎక్సైజ్ శాఖ అధికారులకు వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు ఈ నెల 9న వేలం నిర్వహిస్తున్నట్లు స్థానిక ఎక్సైజ్ సీఐ గురువయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఉదయం 10గంటలకు వేలంలో పాల్గొనవచ్చన్నారు. పూర్తి వివరాలకు జిల్లా కేంద్రంలోని తోల్లవాగు సమీపంలోగల ఎక్సైజ్ స్టేషన్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

నేడు చెన్నూర్ ఎక్సైజ్ ఆఫీస్‌లో...

చెన్నూర్: చెన్నూర్ ప్రొహిబిషన్ ఎక్సైజ్ కార్యాలయంలో ఈ నెల 8న బుధవారం ఉదయం 11గంటలకు వివిధ కేసుల్లో పట్టుబడిన తొమ్మిది వాహనాలను జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వేలం వేస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ హరి తెలిపారు. రెండు ద్విచక్ర వాహనాలు రోడ్డు సామర్థ్యం కలిగినవి, ఏడు వాహనాలు స్క్రాప్ కింద వేలం వేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వ్యక్తులు వేలం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బాలికల గృహంలో ఆశ్రయం

మంచిర్యాలటౌన్: జిల్లా బాలల రక్షణ విభాగం, చైల్డ్ హెల్ప్‌లైన్ సిబ్బంది బృందం మంచిర్యాల రైల్వే స్టేషన్ సమీపంలో కాపాడిన 8ఏళ్ల బాలికకు ప్రభుత్వ బాలికల గృహంలో ఆశ్రయం కల్పించినట్లు జిల్లా సంక్షేమ శాఖ అధికారి రాఫ్‌ఖాన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.